క్లుప్తంగా

వెంకన్న ఆభరణాలు తనిఖీ


స్వామి ఆభరణాలు పరిశీలిస్తున్న అధికారులు

తంబళ్లపల్లె: మండలంలోని కోసువారిపల్లెలో వెలసిన శ్రీ ప్రసన్న వెంకటరమణస్వామి ఆలయంలో సోమవారం స్వామివారి ఆభరణాలను టీటీడీ గోల్డ్ వెరిఫికేషన్ అధికారుల బృందం తనిఖీ చేసింది. ప్రతి ఏడాది చేపట్టే సాధారణ తనిఖీలో భాగంగా స్వామివారి ఆభరణాలను పరిశీలించినట్లు ఎఈఓ గోపినాథ్, సూపరింటెండెంట్ మునిబాలకుమార్, మునిచంగ్రలాయులు తెలిపారు. అన్ని ఆభరణాలు సవ్యంగా ఉన్నట్లు తనిఖీ బృందం వెల్లడించింది. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఇన్స్పెక్టర్ దుష్యంత్‌కుమార్, నగేష్, రవి తదితరులు పాల్గొన్నారు.

మహిళలు లేని సమాజాన్ని ఊహించలేం


మాట్లాడుతున్న బోనకల్లు శారోను

కురబలకోట: మహిళలు లేని సమాజాన్ని ఊహించలేమని ఖమ్మం జిల్లా బోనకల్లు దైవసేవకురాలు, మదనపల్లెకి చెందిన బొంతల తిమోతి (ఖమ్మం తిమోతి) కుమార్తె శారోను పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లా అంగళ్లు సీయోను ప్రార్థన మందిరంలో ప్రధాన దైవ సేవకులు విక్టర్ వేదనాయకమ్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. సమావేశంలో పలువురు మహిళలు పాల్గొన్నారు.

650 క్వింటాళ్ల ఉలవలు దిగుమతి

బి.కొత్తకోట: తంబళ్లపల్లె నియోజకవర్గానికి సోమవారం 650 క్వింటాళ్ల ఉలవలను ప్రభుత్వం నుంచి దిగుమతి అయినట్లు వ్యవసాయశాఖ ఏడీఏ శివశంకర్ తెలిపారు. వర్షాభావంతో ఖరీఫ్ సాగు తగ్గిపోవడంతో ప్రత్యామ్నాయంగా ఉలవలు సాగు చేసేందుకు ప్రభుత్వం వీటిని రైతులకు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. తంబళ్లపల్లె మండలానికి 350, ములకలచెరువు మండలానికి 100, పెద్దతిప్ప సముద్రం మండలానికి 200 క్వింటాళ్లు దిగుమతి అయ్యాయని, వీటిని రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు పంపిణీ చేస్తామని తెలిపారు.

పరిశుభ్రతతో రోగాలు దూరం


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సబ్‌యూనిట్ అధికారులు

పీలేరు : వ్యక్తిగత పరిశుభ్రత ద్వారా రోగాలు దరిచేరవని మలేరియా సబ్‌యూనిట్ అధికారి విద్యాసాగర్, హెచ్‌ఈ కొండయ్య అన్నారు. సోమవారం తలపుల పీహెచ్‌సీ పరిధిలోని రామానాయక్ తాండాలో అంటువ్యాధుల అదుపుపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తేలికపాటి నివారణ చర్యలతో అంటువ్యాధుల అదుపు చేయవచ్చని చెప్పారు. ప్రతి ఒక్కరూ మెరుగైన ఆరోగ్యం కోసం గృహాల్లో ఆహార పదార్థాలపై దుమ్ము ధూళి పడకుండా, ఈగలు వాలకుండా మూతలు పెట్టాలని సూచించారు. దోమలు వృద్ధి చెందకుండా జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీలో ఖాళీ షాపులకు టెండర్లు

పీలేరురూరల్ : పీలేరు ఆర్టీసీ డిపో పరిధిలో ఖాళీషాపులకు టెండర్లకు ఆహ్వానిస్తున్న ఆర్టీసీ డీఎం బి. కుమార్ తెలిపారు. సోమవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ పీలేరులో 31 షాపులు, కలికిరిలో ఐదు షాపులు, కలకడలో ఐదు షాపులకు ఈ నెల 23న టెండర్ ఫారంను అందజేయాలన్నారు. ఆసక్తిగల వ్యాపారస్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కాలభైరవుడికి పూజలు

రాయచోటి టౌన్ : రాయచోటి రూరల్ పరిధిలోని యండపల్లె సమీపంలోని కొండపై వెలసిన శ్రీ కాలభైరవుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం ఆలయంలో ఆలయ ధర్మకర్త ధర్మారెడ్డి ఆధ్వర్యంలో స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి అందంగా అలంకరించి భక్తులకు దర్శన ఏర్పాటు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

శివాలయంలో పూజలు

రైల్వేకోడూరు అర్బన్ : మండలంలోని రాఘవరాజపురం, పట్టణంలోని భుజంగేశ్వర ఆలయాలలో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలోని శివలింగానికి ప్రత్యేకాభిషేకాలు, అర్చనలు నిర్వహించి అలంకరించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

కొత్త కాలేజీలను ప్రారంభించాలి



కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీలను త్వరగా ప్రారంభించాలి. నీట్ విద్యార్థులకు కొత్త మెడికల్ కాలేజీల్లో సీట్లు వచ్చే అవకాశం ఉంది. నీట్ పరీక్షలు రాసి ఉత్తీర్ణత సాధించిన చాలా మంది విద్యార్థులు ప్రభుత్వ కాలేజీల్లో సీట్లు వస్తాయని ఆశలు పెట్టుకున్నారు. గత ప్రభుత్వంలో 17 వైద్య కళాశాలలు మంజూరయ్యాయి. వైద్య కాలేజీలను ప్రైవేటుకు ఇవ్వకుండా ప్రభుత్వమే నిర్వహిస్తే మధ్య తరగతి విద్యార్థులకు మేలు జరుగుతుంది. రాష్ట్ర ప్రభుత్వం మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరించాలనే ఆలోచన, సీట్లు తగ్గించాలనే నిర్ణయంతో ఎన్నో ఆశలతో ఉన్న మేము నష్టపోయే అవకాశం ఉంది. ప్రభుత్వం న్యాయం చేయడానికి చర్యలు తీసుకోవాలి.

–హరిసూర్య, నీట్ విద్యార్థి, మదనపల్లె



ప్రైవేటు పరం చేయడం దారుణం



కొత్తగా నిర్మించిన మెడికల్ కాలేజీలను ప్రభుత్వమే నిర్వహించాలి. ప్రైవేటు పరం చేయడం దారుణమైన విషయం. ఎంతో మంది కష్టపడి నీట్ పరీక్ష రాశారు. పేద విద్యార్థులకు మేలు చేయాలని గత ప్రభుత్వం వేల కోట్లు ఖర్చు చేసి మెడికల్ కాలేజీలను నిర్మించింది. ఇప్పుడు వాటిని ప్రైవేటుపరం చేయాలనుకోవడం అన్యాయం. మదనపల్లెలో మెడికల్ కాలేజీని ప్రారంభిస్తే స్థానికులకు వైద్య విద్య అందుబాటులోకి వస్తుంది. ప్రభుత్వం అవలంభిస్తున్న తీరుతో పేద విద్యార్థులకు వైద్య విద్య దూరం అవుతారు. పేదలకు ఉచిత వైద్యం అందకుండా పోయే పరిస్థితి ఏర్పడుతుంది. ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలి.

–గంగారాణి, ఏఐఎస్ఎఫ్ నాయకురాలు, మదనపల్లె

డీజే బీటు.. గుండెకు చేటు..!

పరిధికి మించి శబ్దాలను వినడం వల్ల వినికిడి సమస్యతోపాటు ఇతర సమస్యలు వచ్చే అవకాశముంది. భారీ శబ్దాల వల్ల గుండెపోటు రావచ్చు. యాంగ్జైటీ (గుండె దడ) ఉన్నవాళ్లు డీజే శబ్దాలను వినడం వల్ల తీవ్రమైన ఒత్తిడికి గురవుతారు. వీక్‌నెస్‌తో బాధపడే వారికి కార్డియాక్ అరెస్టు కావచ్చునని నిపుణులు చెబుతున్నారు. విపరీతమైన శబ్దాలు విన్నప్పుడు గుండెకు రక్తాన్ని సరఫరా చేసే రక్తనాళాలు ముడుచుకుపోతాయి. దీనివల్ల గుండెకు రక్త సరఫరా ఆగిపోయి గుండెపోటు రావచ్చని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

- పరిధికి మించిన శబ్దంతో గుండెపోటు
- 85 డెసిబుల్స్ దాటితే అత్యంత ప్రమాదకరం
- వినికిడి కోల్పేయే ప్రమాదం

మదనపల్లె సిటీ: సాధారణంగా మనిషి చెవులు 85 డెసిబుల్స్ వరకు శబ్దాన్ని తట్టుకోగలవు. ఆ పరిమితి దాటితే చెవికే కాదు గుండెకూ ప్రమాదమే. కానీ డీజే సౌండ్ బాక్సుల నుంచి వచ్చే శబ్దంతో తెలుసా..? ఏకంగా 150 నుంచి 200 డిసిబెల్స్. ఇప్పుడు వినాయకచవితి నిమజ్జనోత్సవాలు జరుగుతున్నాయి. ఒకప్పటిలా సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసి వినాయకుడిని సాగనంపే అలవాటు పోయింది. ఊరేగింపుల దగ్గర డీజే శబ్దాలే. ఈ డీజేల నుంచి వచ్చిన డెసిబుల్స్ శబ్దాలు అధికంగా ఉండటంతో అక్కడిక్కడే కుప్పకూలిపోతున్నారు. ఇలా చనిపోతున్న వారిలో ప్రధానంగా యువతతో పాటు 60 ఏళ్ల వయస్సులోపు ఉన్న వారు అధికంగా ఉన్నట్లు సర్వేలు చెబుతున్నాయి. మదనపల్లె మండలం వలసపల్లె పంచాయతీ కృష్ణాపురానికి చెందిన కొండప్ప కుమారుడు ప్రశాంత్ మెలకలదిన్నెలో వినాయక నిమజ్జనంలో పాల్గొని డీజే వాహనం వద్ద డ్యాన్స్ చేశాడు. ఛాతిలో నొప్పి రావడంతో అక్కడే కుప్పకూలిపోయాడు. ఆస్పత్రికి తరలించే లోపు మృతి చెందాడు. అలాగే బి.కొత్తకోట మండలం నాయనబావికి చెందిన శంకర కుమారుడు ఆకాష్ వినాయక ఉత్సావాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇంటికి వచ్చిన కొద్ది సేపటికే కుప్పకూలిపోయాడు. ఆస్పత్రికి తరలించే లోపే మరణించాడు. ఇలాంటి ఘటనలు మదనపల్లె డివిజన్‌లో చోటుచేసుకున్నాయి.


మృతి చెందిన బి. కొత్తకోట మండలం నాయనబావి వాసి ఆకాష్ (ఫైల్)


మదనపల్లి మండలం వలసపల్లికి చెందిన ప్రశాంత్ మృతదేహం (ఫైల్)

ఎందుకంత ప్రమాదం

ఇద్దరు మాట్లాడుకుంటే 20 డెసిబుల్స్ శబ్దం వస్తుంది. గట్టిగా అరుచుకుంటే 30–40 డిసిబుల్స్ ఉంటుంది. 85 డిసిబుల్స్ దాటిన శబ్దాలను ఎనిమిది గంటల పాటు వింటే కొద్ది రోజుల్లోనే చెవుడు వస్తుంది. ప్రభుత్వం 75 డిసిబుల్స్ వరకు మాత్రమే అనుమతి ఇస్తుంది. డీజే సౌండ్స్ 200 డెసిబుల్స్ దాటిపోతోంది. పరిధికి మించి శబ్దాలను వినడం వలన గుండె పోటు రావచ్చు. చెవిలో ఉండే క్లాకియా అనే భాగం శబ్ద తరంగాలను మెదడుకు చేరుస్తుంది. పరిధికి మించి శబ్దాలు వినడం వలన క్లాకియాలో ఉంటే నరాలు ఒత్తిడికి గురై డ్యామేజీ అయి వినికిడి కోల్పోయే ప్రమాదం ఉంది.

హార్ట్‌బీట్ పెరిగి కుప్పకూలిపోతారు



డీజేల నుంచి వచ్చిన పాటలకు హార్ట్‌బీట్ మరింత పెరిగి సాధారణం కంటే అధికంగా శారీరక శ్రమతో నృత్యాలు చేస్తారు. దీంతో ఒక్కసారి హార్ట్‌బీట్ పెరిగి గుండెకు వెళ్లాల్సిన రక్తప్రసరణ నిలిచిపోయి ఒక్కసారిగా కుప్పకూలిపోతారు. ఇటీవల కాలంలో డీజేల వలన ఎంతో మంది మృత్యువాత పడ్డారు.

–శివారెడ్డి, గుండె వైద్యుల నిపుణులు, మదనపల్లె

నేటి నుంచి స్వచ్ఛతా హి సేవా కార్యక్రమం

పెద్దతిప్పసముద్రం: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఈ నెల 17 నుంచి స్వచ్చతా హి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ కేఎస్ బాలాజీ తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ ప్రధానంగా పారిశుద్ధ్య నిర్వహణ, ఆరోగ్య పరిరక్షణ లాంటి కార్యక్రమాలు ఆయా గ్రామ ప్రజా ప్రతినిధుల సహకారంతో నిర్వహించాలని సూచించారు. అక్టోబర్ ఒకటో తేదీ వరకు జరిగే ఈ కార్యక్రమాలు అధికారులు విజయవంతం చేయాలని ఆయన కోరారు.

పీలేరు మండలంలో..

పీలేరురూరల్ : మండలంలో నేటి నుంచి అక్టోబర్ 2 వరకు నేటి నుంచి స్వచ్చతా హి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని ఎంపీడీఓ ఉపేంద్రరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో ర్యాలీలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పారిశుద్ధ్య కార్మికుల హెల్త్ క్యాంపులు నిర్వహించి, వారిని ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో భాగస్వాములను చేయాలని కోరారు.

ఝరికోన కార్మికులకు వేతనాలు చెల్లించాలి

కేవీపల్లె : మండలంలోని ఝరికోన ప్రాజెక్టు పరిధిలో పని చేస్తున్న కార్మికులకు పెండింగ్ వేతనాలు తక్షణం చెల్లించాలని ఏఐటీయూసీ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు టి.ఎల్. వెంకటేష్ డిమాండ్ చేశారు. సోమవారం ఝరికోన ప్రాజెక్టు కార్మికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఝరికోన ప్రాజెక్టు పరిధిలో 49 మంది కార్మికులు పని చేస్తున్నారని తెలిపారు. పది నెలలుగా కార్మికులకు జీతాలు అందక చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కుటుంబాలు పోషించుకోవడానికి, పిల్లలను చదివించుకోవడానికి కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ప్రజలకు తాగునీటి కష్టాలు రాకుండా రేయింబవళ్లు కార్మికులు కష్టపడి పని చేస్తున్నారని తెలిపారు. అలాంటి వారికి జీతాలు సక్రమంగా అందేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్మికులు ఆనందబాబు, నాగరాజ, ఎర్రయ్య, శివ, భరత్‌రెడ్డి, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ క్షౌరవృత్తిదారుల దినోత్సవం


కేక్ కట్ చేస్తున్న నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు

పీలేరు : స్థానిక నాయీబ్రాహ్మణ కాలనీలో ప్రపంచ క్షౌరవృత్తిదారుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. సోమవారం నాయీబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం డివిజన్ అధ్యక్షుడు అంజి మాట్లాడుతూ సమాజానికి నాయీ బ్రాహ్మణుల అవసరం ఎంతో ఉందని తెలిపారు. తాము ఆత్మగౌరవంతో కుల వృత్తిని నమ్ముకుని సమాజానికి సేవలందిస్తున్నామని చెప్పారు. తమ సామాజిక అభివృద్ధికి ప్రభుత్వం సహకారం అందించాలని కోరారు. నాయకులు వెంకటేష్, రమేష్, ముఖేష్ పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పోడియం తొలగింపు


బి.కొత్తకోట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో తొలగించిన పోడియం

బి.కొత్తకోట: స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అధికారి కూర్చునే పోడియం, రెయిలింగ్‌ను సోమవారం తొలగించారు. కార్యాలయాల్లో సబ్ రిజిస్ట్రార్ ముందు ప్రత్యేకంగా పోడియంలు ఉండడంతో ప్రజలకు, అధికారులకు, ప్రభుత్వానికి మధ్య అంతరం పెరుగుతోందని ప్రభుత్వం భావించింది. ప్రభుత్వ ఆదేశాలతో సబ్ రిజిస్ట్రార్ అధికారి కూర్చునే పోడియం రాచరిక పద్ధతికి అనవాళ్లుగా ఉన్నాయంటూ ప్రభుత్వం వాటిని తొలగించాలని నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా సబ్ రిజిస్ట్రార్ కూర్చునే ఎత్తయిన పోడియంను పూర్తిగా తొలగించారు. ప్రస్తుతం అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు కూర్చునే విధంగానే సీటు ఏర్పాటు చేయనున్నారు. గతంలో ఎవరైనా అధికారితో మాట్లాడాలంటే ఎత్తులో కూర్చున్న అధికారిని తగ్గులో నిలబడి మాట్లాడాల్సి వచ్చేది.

నేటి నుంచి గుర్రంకొండకు బడి బస్సు

మదనపల్లె సిటీ: మదనపల్లె నుంచి గుర్రంకొండకు విద్యార్థుల కోసం ప్రత్యేకంగా బడి బస్సును మంగళవారం నుంచి నడపనున్నట్లు ఆర్టీసీ–1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. రాష్ట్ర రవాణాశాఖ మంత్రి ఎం.రాంప్రసాద్‌రెడ్డి సూచనల మేరకు మదనపల్లె నుంచి ఉదయం 6 గంటలకు గుర్రంకొండకు బయలుదేరుతుందన్నారు. గుర్రంకొండ నుంచి 7.30 గంటలకు మదనపల్లెకు బస్సు బయలుదేరుతుందని తెలిపారు. సాయంత్రం మదనపల్లె నుంచి 3.30 గంటలకు గుర్రంకొండకు, ముదివేడు మోడల్ స్కూల్ నుంచి సాయంత్రం 4.20 గంటలకు బస్సు బయలుదేరుతుందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కలిచెర్లలో పారిశుద్ధ్య పనులు


కాలువలను శుభ్రం చేయిస్తున్న సర్పంచ్ విశ్వనాథ

పెద్దమండ్యం: మండలంలోని కలిచెర్లలో రెండు రోజులుగా పారిశుద్ధ్యం పనులు చేపట్టారు. గ్రామ సర్పంచ్ జింకా విశ్వనాథ ఆధ్వర్యంలో పనులు చురుగ్గా జరుగుతున్నాయి. కలిచెర్ల బస్టాండు కూడలి నుంచి గుర్రంకొండ మార్గంలో ఉన్న మురుగునీటి కాలువను శుభ్రం చేయిస్తున్నారు. కాలువపై ఏర్పాటు చేసిన బండలను జేసీబీతో తొలగించి, పూడికను తీసి ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారు. అలాగే మురుగును శుభ్రం చేస్తున్నారు. పారిశుద్ధ్యం పనులలో భాగంగా మురుగునీటి కాలువను శుభ్రం చేయడంతో ఇబ్బందులు లేకుండా మురుగునీరు వెలుతోందని స్థానికులు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో ప్రజలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఐపీఎస్ అధికారులపై రెడ్‌బుక్ కుట్ర


పి.విశ్వనాథరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి

రాజంపేట : నిజాయితీగా సేవలందించిన ఐపీఎస్ అధికారులపై కూటమి ప్రభుత్వం రెడ్‌బుక్ ఆధారంగా కక్షసాధింపు చర్యలకు దిగుతోందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికారప్రతినిధి పాపినేని విశ్వనాథరెడ్డి (విస్సీ) అన్నారు. సోమ వారం తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ ముంబై నటి జెత్వానీ పేరుతో పీఎస్ఆర్, కాంతి రాణా, విశాల్ గున్నీలను సస్పెన్షన్ చేయించడం కూటమి ప్రభుత్వం పన్నాగమన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పారదర్శకంగా పాలన అందించిన ఐపీఎస్ అధికారుల పట్ల కక్షపూరితంగా ప్రభుత్వం వ్యవహారిస్తోందని ఇప్పటికే ఐపీఎస్ వర్గాల్లో ప్రచారం జరుగుతోందన్నారు. కూటమి పాలనలో కేసులు, దౌర్జన్యాలు, ఐపీఎస్, ఐఏఎస్ అధికారులను లొంగదీసుకునేందుకు వివిధ రకాల బెదిరింపులకు పాల్పడటం యథేచ్ఛగా కొనసాగుతోందన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో చిత్తశుద్ధి చూపకుండా, అనైతిక, అప్రజాస్వామిక రాజకీయాలను చేస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న విధ్వంసక, ప్రజా వ్యతిరేక వైఖరిని ప్రజలకు ఎప్పటికప్పుడు తెలియజేయడమే కాక ప్రజాపోరాటాలు చేస్తామన్నారు. ప్రభుత్వం తీసుకొచ్చిన ఇసుకపాలసీ ప్రజలకు కష్టాలను తెచ్చిపెడుతోందని, ఉచితం అని చెప్పి ప్రజల చెవ్వులు ముఖ్యమంత్రి పువ్వులు పెట్టారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తన పంథా మార్చుకుని ప్రజాసంక్షేమానికి కృషి చేయాలని హెచ్చరించారు.

శాస్త్రీయ విద్యావిధానం అమలుకు పోరాటం


మాట్లాడుతున్న ఓర్సు వీరభాస్కర్

రైల్వేకోడూరు అర్బన్ : పోరాటాలు, త్యాగాలు ఫలితంగానే ఏఐఎస్ఎఫ్ ఏర్పడిందని జిల్లా అధ్యక్షులు మాధవ్ సోమవారం తెలిపారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ అఖిల భారత విద్యార్థి సమాఖ్య విద్యార్థుల సమస్యలు పోరాటాల త్యాగాల ఫలితంగానే ఏర్పడిందన్నారు. యువకుల్లో దేశభక్తి మెండుగా నింపిదన్నారు. పోరాటాలు, త్యాగాలు, బలిదానాలు ఎందరో చేశారని చెప్పారు. శాస్త్రీయ విద్యా విధానం అమలుపై నిరంతరం పోరాటాలు చేస్తున్నామన్నారు. అనంతరం నియోజకవర్గ అధ్యక్ష కార్యదర్శులుగా నాగేంద్ర, ప్రవీణ్‌లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో చైతన్య తదితరులు పాల్గొన్నారు.

ఆనాటి జ్ఞాపకాలు.. మధుర స్మృతులు


సమ్మేళనంలో పాల్గొన్న 1991-92 టీచర్ ట్రైనింగ్ బ్యాచ్ విద్యార్థులు

మదనపల్లె సిటీ: ఎక్కడెక్కడో ఉంటూ జీవనం సాగిస్తున్న వారంతా ఒక్కచోటకు చేరారు. మూడు దశాబ్దాల తర్వాత మళ్లీ ఒకరికొకరు చూసుకున్న ఆనందంతో ఉబ్బితబ్బిబ్బయ్యారు. పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అప్పటి సంగతులను గుర్తు చేసుకుంటూ ఆనందంగా గడిపారు. మదనపల్లె పట్టణం వివేకానంద మున్సిపల్ ఉన్నత పాఠశాలలో సోమవారం కర్ణాటక రాష్ట్రం కోలార్‌లో 1991–92 విద్యా సంవత్సరంలో టీచర్ ట్రైనింగ్ చేసిన పూర్వ విద్యార్థులందరూ సోమవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. విద్యాబుద్ధులు చెప్పిన గురువులు విశ్వనాథ్, వెంకటరమణ, శ్రీనివాస్, కళావతి, రాఘవరెడ్డి, శ్రీరామరెడ్డి, గంగులప్ప, శ్రీనివాసగౌడ ఆహ్వానించారు. గురువుల ఆశీస్సులు తీసుకున్నారు. మిత్రులందరూ కలిసి ఒకరినొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆనాటి జ్ఞాపకాలు ఎప్పటికీ మధుర స్మృతులే అని పలువురు పూర్వ విద్యార్థులు పేర్కొన్నారు. కార్యక్రమంలో పూర్వపు విద్యార్థులు దేవేంద్రరెడ్డి, మోహన్, రవికుమార్, దీనదయాళ్, చలపతి, వెంకటరమణ, ప్రేమ, విజయకుమారి, ఇందిరా, భారతి, శివాచారి, భాస్కర్, దామోదర్‌రెడ్డి పాల్గొన్నారు.

మహోపకారి ప్రవక్త మహమ్మద్


మదనపల్లె సిటీ: శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు


పెద్దమండ్యం: పాతూరులో మిలాద్ ఉన్ నబీ వేడుకల్లో పాల్గొన్న ముస్లింలు

మదనపల్లె సిటీ: మహోపకారి ప్రవక్త మహమ్మద్ అని స్థానిక మోతీనగర్ మత గురువు ఖుతుబ్ అలాం కొనియాడారు. సోమవారం మహాప్రవక్త హజరత్ మహమ్మద్ జన్మదినాన్ని పురస్కరించుకుని మిలాద్ ఉన్ నబీ పర్వదినాన్ని ముస్లింలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. స్థానిక మోతీనగర్ మసీదు నుంచి ముస్లింలు సామూహికంగా శాంతి ర్యాలీ నిర్వహించారు. నారే తక్బీర్ అల్లాహో అక్బర్.. నారే రిసాలత్ యా రుసులుల్లా అంటూ మహా ప్రవక్త మహమ్మద్‌ను స్మరించుకుంటూ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. మత గురువులు మాట్లాడుతూ మహాప్రవక్త మహమ్మద్ ప్రపంచానికి శాంతి సందేశాన్ని ఇచ్చారన్నారు. ప్రతి ఒక్కరూ మానవత్వంతో పరులకు సహాయ, సహకారాలు అందించి శాంతియుత సమాజాన్ని నిర్మించాలని కోరారు. అదే మహాప్రవక్తకు నివాళి అని అన్నారు. ఇస్లాం అంటే శాంతి అని దీనిని స్థాపించడం మనందరి బాధ్యతన్నారు. ఇస్లాంలో ప్రతి పండుగ ఒక సందేశాన్ని ఇస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ముస్లింలు పాల్గొన్నారు.

నేడు సదస్సు

స్థానిక బెంగుళూరు బస్టాండు వద్ద ఉన్న బడేమకాన్ దర్గా ఆవరణంలో మంగళవారం రాత్రి మిలాద్ ఉన్ నబీ ధార్మిక సదస్సు నిర్వహిస్తున్నట్లు దర్గా కమిటీ నిర్వాహకులు మకాన్‌దార్ సయ్యద్ తెలిపారు. కడపకు చెందిన మతగురువు హజరత్ మౌల్వి సయ్యద్ అహ్మద్ పీర్ షహమీరి మహాప్రవక్త హజరత్ మహమ్మద్ జీవితం గురించి ధార్మికోపన్యాసం చేస్తారని తెలిపారు.

పెద్దమండ్యం మండలంలో..

పెద్దమండ్యం: మండలంలోని ఎన్‌టీపల్లె పంచాయతీ కలిచెర్ల పాతూరులో మిలాద్ ఉన్ నబీ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పాతూరు కూడలి వద్ద జెండాను ఆవిష్కరించి, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం పాతూరు పురవిధులలో మిలాద్ ఉన్ నబీ జెండాను ఊరేగించారు. అలాగే పెద్దమండ్యం పాతూరు జెండామాను వద్ద మిలాద్ ఉన్ నబీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ముతవల్లి గౌస్‌పీరా, మాజీ సర్పంచ్ నజీర్‌అహ్మద్, ఫయాజ్, గౌస్‌బాషా, షబ్బీర్‌వలీ, అమీన్, మహ్మద్ అలి ఖాద్రీ, అహ్మద్, బాబా, సయ్యద్‌బాషా, ఆమీన్‌పీర్ పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో మిలాద్ ఉన్ నబీ

పెద్దతిప్పసముద్రం: మహమ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకుని సోమవారం మిలాద్ ఉన్ నబీ వేడుకలను ముస్లింలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మహమ్మద్ ప్రవక్త ప్రవచనాలు ఆచరించడం ద్వారా లోక కల్యాణానికి అందరూ పాటు పడాలని సూచించారు. ఖురాన్ సూక్తులను, భక్తి గీతాలను ఆలపించారు. మహమ్మద్ ప్రవక్త జీవితం అందరికీ అనుసరణీయమని చెప్పారు.

తంబళ్లపల్లెలో..

తంబళ్లపల్లె: మండలంలో సోమవారం మహమ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా ముస్లింలు ఘనంగా మిలాద్ ఉన్ నబీని జరుపుకున్నారు. మండల కేంద్రమైన దర్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు.

చేనేతల సమస్యలు పరిష్కరించాలి

గాలివీడు : రాష్ట్ర వ్యాప్తంగా చేనేతలు, చేనేత పరిశ్రమలు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ చేనేత రాష్ట్ర అధ్యక్షులు ఓర్సు వీరభాస్కర్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాలివీడు మండలం నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. మండల అధ్యక్షుడుగా శిబ్యాల వెంకటరమణ, కార్యదర్శి మోడెం రాము, ఉపాధ్యక్షులు పురుం కృష్ణమూర్తి, ఓర్సు ఆంజనేయులు, కార్యవర్గ సభ్యులు ఓర్సు పవన్ కుమార్, ప్రసాద్ , నాగయ్య, లక్ష్మీనారాయణ, జయరాంలను ఎన్నుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా ఉన్న చేనేతల సమస్యలను పరిష్కరించాలన్నారు.

రక్షణ గోడకు మరమ్మతులు చేపట్టండి

గాలివీడు : కరిమిరెడ్డిగారిపల్లె ప్రాథమిక పాఠశాలలో కూలిన ప్రహరీ గోడకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. ప్రహరీ గోడ కూలీ ఐదేళ్లయినా ఉపాధ్యాయులు, విద్యాధికారులకు సమస్యను తెలియజేసినా ఎలాంటి స్పందన లేదన్నారు. రక్షణ గోడ లేకపోవడంతో పాఠశాలలోకి విష సర్పాలకు వస్తున్నాయని చెప్పారు. అలానే చీకటి పడితే పాఠశాల అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందన్నారు. ఇప్పటికైనా పాఠశాల రక్షణగోడ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని అధికారులను గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.